సాక్షి జగిత్యాల
ఆదివారం । 21 । మే । 2023



## ఘనంగా బీరప్ప ఉత్సవాలు

పెగడపల్లి : రాములపల్లిలో గొల్ల, కురుమల ఆరాధ్య దైవం బీరప్ప ఉత్సవాలు రెండోరోజు శనివారం ఘనంగా నిర్వహించారు.



## పోస్టుకార్డు ఉద్యమం

వెల్గటూర్ : ఇథనాల్ పరిశ్రమ రద్దు చేయాలని పాశిగామ, స్తంభంపల్లి గ్రామస్తులు శనివారం పోస్ట్‌కార్డ్ ఉద్యమం చేపట్టారు.

గరిష్టం/కనిష్టం
42.0/27.0

## వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గి ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.

## న్యూస్‌రీల్

### ప్రజల ఆరోగ్యమే ధ్యేయం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాలరూరల్: గ్రామీణ ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, అడిషనల్ డీఆర్డీవో నరేశ్‌తో కలిసి ఈనెల 17 నుంచి 23 వరకు చేపట్టిన ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమంపై శనివారం సమీక్షించారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పారిశుధ్యం నిర్వహణను విజయవంతం చేయాలని కోరారు. జెడ్పీ సీఈవో రామానుజాచారి పాల్గొన్నారు.

### నేరస్తులకు శిక్ష తప్పదు



అధికారులను సన్మానిస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: నేరం చేసినవారు శిక్ష నుంచి తప్పించుకోలేరని ఎస్పీ భాస్కర్ అన్నారు. జిల్లాలో వివిధ కేసుల్లో సాక్ష్యాలను ప్రవేశపెట్టి శిక్షలు పడేలా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని శనివారం సన్మానించారు. పోలీసులు, ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ, న్యాయ నిరూపన జరిపి కచ్చితంగా శిక్షపడేలా చేస్తారని, క్షణికావేశంలో చేసిన నేరాలకైనా శిక్షలు తప్పవని ప్రజలు గమనించాలని కోరారు. నేరాలను పకడ్బందీగా విచారణ జరిపి సాక్షులు, సాక్ష్యాధారాలను తగు రీతిలో ప్రవేశపెట్టి కోర్టులో విచారణ జరిపి శిక్షలు పడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లికార్జున్, జంగిలి మల్లికార్జున్, ఎ.మల్లేశం, బాలత్రిపుర సుందరి, ఎస్.మురళీ, రాజేశ్, రజిని, మాధవి, పోలీసు శాఖ తరుపున నేర పరిశోధన అధికారులు అడిషనల్ ఎస్పీ జనార్దన్‌రెడ్డి, రిటైర్డ్ ఎస్పీ సురేందర్, ఏసీపీ సాయిమనోహర్, ఓఎస్డీ రాజశేఖర్‌రాజు, సీఐ కిశోర్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ రాజ్‌నాయక్, ఎస్సై కిరణ్‌కుమార్, శ్రీధర్, కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లు ఎల్లయ్య, విద్యాసాగర్‌ను సన్మానించారు.

### 'దోపిడీ చేస్తున్న మిల్లర్లు'



ట్రక్‌షీట్లు పరిశీలిస్తున్న భోగ శ్రావణి

జగిత్యాలరూరల్: మిల్లర్లు రైతులను దోపిడీ చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి విమర్శించారు. పొరండ్ల, హన్మాజీపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆమె సందర్శించి రైతులతో మాట్లాడారు. ట్రక్‌షీట్ల రికార్డుల్లో పొరపాట్లు ఉన్నాయన్నారు. నాయకులు తిరుపతి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

# రంగినేని కెరటాలు

సండే స్పెషల్

- అమ్మానాన్నలను కోల్పోయినా ట్రస్ట్ ఒడిలో ఒదిగి.. ఉన్నతంగా చదివి
- దేశ విదేశాల్లో ఉద్యోగాల్లో స్థిరపడి.. స్ఫూర్తిగా నిలుస్తున్న యువత

బాల్యం అమూల్యమైంది. అమ్మానాన్న ఒడిలో ఆనందంగా గడపాల్సిన సమయమది. కానీ.. పసిప్రాయంలోనే కన్నవాళ్లకు, అయినవారికి దూరమయ్యారు. ఇందులో తల్లిదండ్రులు చనిపోయి అనాథలైన వారు కొందరైతే.. వివిధ కారణాలతో అమ్మ ఆప్యాయతకు, నాన్న అనురాగానికి నోచుకోని బాల్యం మరికొందరిది. తమ భవిష్యత్ ఏంటని ఆలోచన చేస్తున్న వారికి ఆ ట్రస్టు నీడగా నిలిచింది. చదువు చెప్పించింది. కడుపునిండా అన్నం పెట్టింది. ఉండడానికి ఆశ్రయాన్నిచ్చింది. ఆ ఆశ్రయాన్ని ఆసరాగా చేసుకుని అందనంత ఎత్తుకు ఎదిగారు ఆ చిన్నారులు. రంగినేని సుజాత మోహన్ రావు చారిటబుల్ ట్రస్ట్‌లో చదివిన 55మంది వివిధస్థాయిల్లో.. హోదాల్లో దేశవిదేశాల్లో స్థిరపడ్డారు. ఉన్నతంగా స్థిరపడి 'రంగినేని కెరటాలు'గా పేరు పొందారు. - సిరిసిల్ల



రంగినేని ట్రస్ట్ పూర్వ విద్యార్థులు (ఫైల్)



ఈమె మొగిలి శిరీష. జగిత్యాల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్. సొంతూరు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం దేశాయిపల్లి. శిరీష చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోయారు. స్థానిక ఆర్ఎంపీ రాజేశం, టీచర్ సత్యనారాయణ శిరీషను 4వ తరగతిలో ట్రస్ట్‌లో చేర్చారు. పదో తరగతి వరకు ట్రస్ట్‌లో చదువుకుని ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ హైదరాబాద్‌లో పూర్తిచేసింది. 2014లో పోలీస్‌కానిస్టేబుల్(సివిల్)గా ఎంపికై ప్రస్తుతం జగిత్యాల పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తోంది. భర్త రవి వ్యాపారం చేస్తున్నాడు. హిమజ అనే కూతురు ఉంది. తాను ఈ స్థాయిలో ఉండేందుకు 'రంగినేని' ట్రస్ట్ కారణమని శిరీష గర్వంగా చెబుతోంది.

ఇతను పడకంటి గోవర్ధన్‌చారి. జగిత్యాల జిల్లా రాయికల్. బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. సమీప బంధువులు 2004లో సిరిసిల్ల పట్టణ శివారులోని 'రంగినేని' ట్రస్ట్‌లో చేర్పించారు. 8వ తరగతిలో చేరిన గోవర్ధన్ ఇక్కడే 10వ తరగతి, ఇంటర్ పూర్తిచేశాడు. 2011లో రాయికల్‌లో వుడ్ కార్వింగ్ షాపు ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం ఐదు యూనిట్లతో మరో ఐదుగురికి ఉపాధి కల్పిస్తున్నాడు. రంగినేని మోహన్‌రావు ప్రేరణతో ఎదిగానని గోవర్ధన్ చెబుతున్నాడు.



### ఎదిగిన వారెందరో..

ఆత్మహత్యలకు పాల్పడిన నేతకార్మికుల పిల్లలు, ఎన్‌కౌంటర్ బాధితుల పిల్లలు, అమ్మానాన్నలను కోల్పోయిన చిన్నారులకు కులమతాలకు అతీతంగా ట్రస్ట్‌లో ఆశ్రయం కల్పించారు. ట్రస్ట్‌లోనే అ..ఆలు నేర్చుకున్నారు. వివిధ తరగతుల్లో చేరిన వారు బీటెక్, ఎంటెక్, ఎల్ఎల్‌బీ, బీఎస్సీ, పాలిటెక్నిక్, బీఫార్మసీ, ఎంబీఏ చదువుకుని ఉద్యోగాలు సాధించారు. ట్రస్ట్‌లో చదువుకున్న పిల్లల్లో 35మంది ఉద్యోగాలు, మరో 20 మంది స్వయం ఉపాధి సాధించి జీవితంలో స్థిరపడ్డారు. ఉద్యోగాలు చేస్తున్నవారు తాము సంపాదిస్తున్న జీతంలో కొంత సొమ్మును రంగినేని ట్రస్ట్ నిర్వహణకు అందిస్తున్నారు కేవలం 14 మంది పిల్లలతో మొదలై 2020 నాటికి 224మంది వరకు ఆశ్రయం ఇచ్చింది. కరోనా లాక్‌డౌన్‌తో ట్రస్ట్‌ను తాత్కాలికంగా మూసివేసినా పునఃప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



### గుజరాత్‌లో జాబ్ చేస్తున్నా



మాది తంగళ్లపల్లి మండలం చింతలఠాణా. తొమ్మిదేళ్ల ప్రాయంలో ట్రస్ట్‌లో చేరాను. ఆరేళ్లు చదువుకున్న. ఇంటర్ సీవీ రామన్ కాలేజీలో చేశాను. ఎంసెట్ రాసి ఉస్మానియా యూనివర్సిటీలో కెమికల్ ఇంజినీరింగ్ చేశాను. గుజరాత్‌లో లార్సెన్ అండ్ టూబ్రో కంపెనీలో మంచి వేతనంతో పని చేస్తున్నాను.
– గారిపల్లి సందీప్, గుజరాత్

### మేమిద్దరం పని చేస్తున్నాం



నేను ట్రస్ట్‌లో పదోతరగతి వరకు చదివాను. హైదరాబాద్‌లో బీటెక్ చేశా. నా చదువులకు ట్రస్ట్ సాయం చేసింది. ఇప్పుడు క్యాప్‌జెమిని కంపెనీలో చేస్తున్న. మా ఆవిడ సౌమ్య టీసీఎస్‌లో చేస్తోంది. మోహన్‌రావు తాతయ్య, వెంకట్‌రావు సారు క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్పించారు.
– తోనుపునూరి యశ్వంత్, వరంగల్

### అమ్మానాన్న చనిపోయారు



మాది సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం రామవరం. మూడో తరగతిలోనే అమ్మానాన్న లక్ష్మీ, గట్టయ్య చనిపోయారు. 2003లో రంగినేని ట్రస్ట్‌లో చేరాను. హైదరాబాద్‌లో పీజీ చేశాను. కాలేజీలో జూనియర్ లెక్చరర్‌గా పని చేస్తున్న. గ్రూప్స్ ప్రిపేర్ అవుతున్న. గాయకుడిగా గుర్తింపును రంగినేని ట్రస్ట్ కల్పించింది. ఎన్నో వేదికలపై పాడాను.
– జాతరకొండ సంపత్, రామవరం

### పిల్లలు స్థిరపడితే తృప్తి



ట్రస్ట్‌లో చదువుకున్న పిల్లలు ఉద్యోగాలు సాధించి స్థిరపడడం తృప్తిగా ఉంది. నాకు చేతనైన సాయం చేయాలని ట్రస్ట్ పెట్టాను. కరోనాతో ఇబ్బంది ఏర్పడినా మా అబ్బాయి నవీన్, రిటైర్డు హెచ్ఎం తూడి వెంకట్రావు, ముత్యంరెడ్డి, రిటైర్డు ప్రిన్సిపల్ ప్రతాప్, ట్రస్ట్ సభ్యుల ప్రోత్సాహంతో మళ్లీ తెరిచాం. పేదలకు నాణ్యమైన విద్య అందిస్తున్నాం.
– రంగినేని మోహన్‌రావు, ట్రస్ట్ వ్యవస్థాపకుడు

# వేగంగా ధాన్యం కొనుగోళ్లు

- హమాలీల కొరత తీర్చాలి
- పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాలరూరల్: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశించారు. చల్‌గల్‌లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఇప్పటివరకు సేకరించిన, ఇంకా కొనుగోలు చేయాల్సిన వడ్ల వివరాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చిన వెంటనే తేమశాతం పరిశీలించి కొనుగోలు పూర్తిచేయాలని చెప్పారు. ఓపీఎంఎస్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. హమాలీల కొరత లేకుండా చూడాలని అన్నారు. తూకం వేసిన వడ్లను వెంటనే లోడింగ్ చేసి మిల్లులకు తరలించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎం రజనీకాంత్, ఏపీడీ సుధీర్, ఏపీఎం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

**పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి..**

గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. చల్‌గల్ గ్రామపంచాయతీలో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. చెత్తాచెదారం లేకుండా పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. నీటిగుంతలు పూడ్చివేయాలని అన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

ఈ కార్యక్రమంలో డీపీవో దేవరాజ్, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ ఉరిమిన మేఘం



చెట్టు విరిగిపడి ధ్వంసమైన కారు



ధాన్యం కాపాడుకునేందుకు రైతుల పాట్లు

- జిల్లాలో గాలివాన బీభత్సం
- తడిసిముద్దయిన ధాన్యం
- విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- జిల్లాకేంద్రంలో ధ్వంసమైన వాహనాలు

జగిత్యాలరూరల్: జిల్లాలో అకాల వర్షం మరోసారి అన్నదాతను నిండా ముంచింది. శనివారం మధ్యాహ్నం గాలివాన సుమారు గంటపాటు బీభత్సం సృష్టించింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయ్యింది. మరికొంత వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయి. విద్యుత్ తీగలు తెగి సరఫరా నిలిచిపోయింది. జనజీవనం ఒక్కసారిగా స్తంభించింది.

**జిల్లా కేంద్రంలో..**

విద్యానగర్‌లో చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడింది. విద్యుత్ స్తంభం విరిగి కారుపై పడటంతో కారు ధ్వంసమైంది. బైపాస్ రోడ్డులో చెట్టు విరిగి పడటంతో కారు దెబ్బతింది. సుమారు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మోరపల్లి, చల్‌గల్ గ్రామాల్లో ధాన్యం తడిసిపోయింది. రైతులు ధాన్యం తడవకుండా పాలిథిన్ కవర్లు కప్పుకున్నారు.

**సారంగాపూర్(జగిత్యాల):** సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో గంటపాటు బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. గాలివాన ధాటికి గ్రామాల్లో చెట్లు విరిగిపడ్డాయి. ప్రముఖ పుణ్యక్షేత్రం బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం మండపం వద్ద ఉన్న భారీ రావిచెట్టు విరిగి ఆలయం -ధ్వజస్తంభం మధ్య పడింది. నష్టం ఏమీ జరగలేదని అర్చకుడు మధుకుమార్ తెలిపారు.

**గొల్లపల్లి(ధర్మపురి):** చిల్వాకోడూర్, అబ్బాపూర్, దట్నూర్, గోవిందుపల్లి, బొంకూర్, గుంజపడుగు, అగ్గిమల్ల తదితర గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. అప్పటిదాకా ఎండలకు ధాన్యం ఆరబోసిన అన్నదాతలు.. ఒక్కసారిగా గాలివాన రావడంతో ఉరుకులు పరుగులు పెట్టారు. వందలాది క్వింటాళ్ల ధాన్యం తడిసింది. కొంత వర్షపునీటిలో కొట్టుకుపోయింది. రైతులు అప్రమత్తమై టార్పాలిన్ కవర్లు కప్పినా అప్పటికే నష్టం జరిగిపోయింది.

**ధర్మపురి(బుగ్గారం):** మద్దునూర్, సిరికొండ, నేరెళ్లలో ధాన్యం నీటి పాలైంది. తేమశాతం పేరిట కొనుగోళ్లలో జాప్యం చేయడంతో అకాల వర్షానికి ధాన్యం తడిసిముద్దయ్యిందని రైతులు ఆవేదన చెందారు. నెలలో మూడుసార్లు అకాల వర్షాలు కురవడంతో వడ్లు తడిసి ఎందుకూ పనికిరాకుండా పోయాయని కన్నీటిపర్యంతమయ్యారు. బుగ్గారం మండలం సిరికొండలో పిడుగుపాటుకు రెండు మేకలు మృత్యువాత పడ్డాయి.

**వెల్గటూర్(ధర్మపురి):** శాకాపూర్‌లో పిడుగుపడి కొబ్బరిచెట్టు కాలిపోయింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. రైతులు అద్దె టార్పాలిన్ల కోసం పరుగులు పెట్టగా అప్పటికే వడ్లు వర్షార్పణమయ్యాయి. కళ్ల ముందే ధాన్యం నీళ్లలో కొట్టుకుపోతుంటే రైతుల గుండెలు పగిలినంత పనైంది.



జగిత్యాలలో కురుస్తున్న వర్షం



పిడుగుపాటుకు కాలిపోతున్న కొబ్బరి చెట్టు

# అమ్మానాన్నకు ఏమైంది?

- వెక్కివెక్కి ఏడ్చిన ముగ్గురు చిన్నారులు
- కన్నీటి పర్యంతమైన తిమ్మయ్యపల్లె గ్రామస్తులు



బిక్కుబిక్కుమంటున్న హర్ష, అన్వేష్, పూజిత్

కోరుట్ల/కోరుట్లరూరల్: 'అంకుల్.. మా నాన్నకు ఏమైంది.. ఆంటీ.. మా అమ్మకు ఏం జరిగింది.. అందరూ గిట్ల ఎందుకు ఏడుస్తున్నరు..' అని ఆ చిన్నారులు అమాయకంగా అడుగుతూ ఉంటే.. బంధువులు, కుటుంబ సభ్యులేకాదు.. గ్రామస్తులూ కన్నీటిపర్యంతమయ్యారు. కూలీ పనులకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో చనిపోయిన భీమయ్య- ప్రేమలత దంపతుల ముగ్గురు కుమారుల దీనస్థితి ఇది..



భీమయ్య-ప్రేమలత మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు, కుటుంబసభ్యులు

### కూలీ పనులు చేస్తూ.. సంతోషంగా ఉంటూ..

- కోరుట్ల మండలం తిమ్మయ్యపల్లెకు చెందిన సుర భీమయ్య(35)-ప్రేమలత(30) దంపతులు. పన్నెండేళ్ల క్రితం వివాహం అయింది. వీరికి కుమారులు వరుణ్(9), అన్వేష్(7), పూజిత్(3) ఉన్నారు. ఎప్పటిలాగే శనివారం ఉదయం మోటార్ సైకిల్‌పై భీమయ్య-ప్రేమలత దంపతులు కోరుట్లకు బయలుదేరారు. అక్కడి కాల్వగడ్డ ఏరియాలో శ్లాబ్ వేసే మిల్లర్ పనులకు హాజరు కావాల్సి ఉంది. ఈక్రమంలో కొత్త బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం సమీపంలోని జాతీయ రహదారిపైకి చేరుకుంటున్నారు. ఈక్రమంలో అదే రోడ్డుపై వేగంగా వస్తున్న లారీని వీరి బైక్ ఢీకొట్టింది. మోటార్ సైకిల్ లారీ కింద ఇరుక్కుపోయింది. భీమయ్య టైర్లకింద పడి నలిగిపోయి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రేమలత తీవ్రగాయాల పాలైంది. స్థానికులు అంబులెన్స్‌లో జగిత్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు వదిలింది.

### పాలు మరువనేలేదు..

- భీమయ్య-ప్రేమలత దంపతుల పెద్ద కుమారుడు హర్ష ఐదో తరగతి, అన్వేష్ మూడో, తరగతి చదువుతున్నారు. పూజిత్ ఇంకా తల్లిపాలు మరువనేలేదు. అమ్మానాన్నల మృతదేహాలు చాపల్లో చుట్టి ఇంటికి తీసుకు రావడంతో వారికి ఏమైందో తెలియక ఆ ముగ్గురు పిల్లలు దీనస్థితిలో తల్లడిల్లిపోతున్నారు. పదేళ్లలోపు వయసు వారు కావడంతో వారి ఆలనాపాలనా చూసేవారు ఎవరని గ్రామస్తులు కంట తడిపెట్టుకున్నారు. పోస్టుమార్టం అనంతరం సాయంత్రం దంపతుల మృతదేహాలు స్వగ్రామానికి తీసుకెళ్లారు. శ్మశానవాటికలో ఒకేచోట భార్యాభర్తల అంత్యక్రియలు నిర్వహించారు.

### పదిహేనేళ్ల క్రితం దుబాయ్‌కి..

- భీమయ్య 15ఏళ్ల క్రితం పొట్టకూటి కోసం దుబాయ్ వెళ్లి వచ్చాడు. అక్కడ పెద్దగా ఉపాధి అవకాశాలు లేక మళ్లీ వెళ్లే ఆలోచన విరమించుకున్నాడు. పన్నెండేళ్ల క్రితం కొడిమ్యాల మండలం దమ్మన్నపేటకు చెందిన ప్రేమలతను వివాహం చేసుకున్నాడు. తిమ్మయ్యపల్లెలోనే చిన్న ఇల్లు కట్టుకున్నాడు. పేద కుటుంబం కావడంతో దంపతులు ఇద్దరూ కూలీనాలీ పనులు చేస్తూ జీవనం గడుపుతున్నారు. వీరికి హర్ష(9), అన్వేష్(7), పూజిత్(3) కుమారులు ఉన్నారు. భీమయ్యకు తల్లిదండ్రులు భీమయ్య-నర్సవ్వతోపాటు తమ్ముడు, చెల్లె ఉన్నారు. వీరికి వివాహాలు అయ్యాయి.

### రూ.10 వేల సాయం

- భీమయ్య దంపతులు పేదవారు కావడంతో అంత్యక్రియల కోసం బీఆర్ఎస్ నాయకుడు కల్వకుంట్ల సంజయ్ రూ.10 వేలు సాయం చేసినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్ తెలిపారు. భీమయ్య కుటుంబం దీనస్థితిని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని ఆయన తెలిపారు.

# బల్దియాల్లో పారిశుధ్యం అధ్వానం

- ఇటీవలే మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు ప్రారంభం
- ప్రధాన వీధులకే పరిమితమని ఆరోపణలు
- నత్తనడకన కొనసాగుతున్నాయని విమర్శలు

జిల్లాలోని మున్సిపాలిటీల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. పలు చోట్ల కాలనీలు కంపుకొడుతున్నాయి. డ్రైనేజీ లేక మురుగునీరు రోడ్లపైకి వచ్చి చేరుతోంది. ఖాళీ స్థలాల్లో మురికి కుంటలను తలపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో మురుగుకాల్వల్లో చెత్త చెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాల్టీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. కానీ సదరు పనులు నత్తనడకన సాగుతున్నాయని.. మున్సిపాల్టీల్లోని ప్రధాన వీధులకే పరిమితమవుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## కంపుకొడుతున్న శివారు కాలనీలు

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని శివారు కాలనీల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఆయా కాలనీలు రోజురోజుకు విస్తరిస్తున్నా ఆ మేరకు మౌలిక వసతులు కల్పించడం లేదు. ముఖ్యంగా డ్రైనేజీలు లేక మురుగునీటి సమస్య ఇబ్బందిగా మారింది. టీచర్స్ కాలనీ, బాలకృష్ణనగర్, అర్బన్ కాలనీ, సాయిరాంనగర్, రాంనగర్, హన్మాన్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఏటా మున్సిపల్ ఆధ్వర్యంలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాలు చేపడుతున్నారు. అయినా ఈ కాలనీల్లో మురుగునీటి సమస్య తొలగడం లేదు. డ్రైనేజీలు లేక మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. కొన్ని చోట్ల ఖాళీ ప్లాట్లలోకి చేరుతుండడంతో అవి మురికిగుంటలుగా మారుతున్నాయి. దీంతో దుర్వాసనతో పాటు దోమల బెడద ఎక్కువగా ఉందని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శివారు కాలనీల్లో వసతుల కల్పనకు అధిక నిధులు కేటాయించాలని ఆయా వార్డులకు చెందిన కౌన్సిలర్లు కోరుతున్నా.. అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు.


టీచర్స్ కాలనీలోని ఖాళీ స్థలంలో నిలిచిన మురుగు నీరు

### ఇబ్బందులు పడుతున్నాం

మురుగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. డ్రైనేజీలు లేక ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. వానాకాలంలో దుర్వాసన, దోమలు బెడద భరించలేకపోతున్నాం. డ్రైనేజీలు నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

– రమేశ్, బాలకృష్ణనగర్

### చర్యలు తీసుకుంటున్నాం



శివారు కాలనీల్లో డ్రైనేజీలు లేకపోవడం సమస్యగా మారింది. ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో వాటిపై దృష్టి సారించాం. ఆయా వార్డులకు ప్రత్యేక ఆఫీసర్‌ను నియమించి మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడుతున్నాం. దశల వారీగా నిధులు కేటాయించి డ్రైనేజీలు నిర్మించి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం.

– జగదీశ్వర్‌గౌడ్, కమిషనర్

## డ్రైనేజీల్లోనే చెత్త చెదారం


ఐదో వార్డులో డ్రైనేజీలో చెత్త చెదారం

రాయికల్(జగిత్యాల): పట్టణంలో 12 వార్డులో దశాబ్ద కాలం క్రితం నిర్మించిన మురికికాలువల్లో చెత్తాచెదారాన్ని మున్సిపల్ సిబ్బంది తొలగించినా అలాగే నిల్వ ఉంటోంది. దుర్వాసన, దోమల బెడద తీవ్రతరమవుతోంది. మురికికాలువల్లో ఆహార పదార్థాలు పేరుకుపోయి దోమలు తీవ్రమై ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

### దోమల బెడద తీవ్రంగా ఉంది



పారిశుధ్య సిబ్బంది మురికికాలువల్లో చెత్త చెదారం తీసినా నిల్వ ఉండే ఆహార పదార్థాలతో దోమల బెడద తీవ్రమవుతోంది. రాత్రి పూట దోమలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– లక్ష్మి, రాయికల్

### ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం



పట్టణంలోని 12వార్డుల్లో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. మురికి కాలువల్లోని చెత్త చెదారం తొలగించి ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నాం. రాయికల్‌లో పందులను తరలించడంతో పాటు, మురికికాలువల్లో ఉన్న దోమలను నివారించేందుకు ఫాగింగ్ చేపడుతున్నాం.– సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

## విజృంభిస్తున్న దోమలు

జగిత్యాల: జగిత్యాల బల్దియాలోని ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగినా అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలున్నాయి. పలు ప్రాంతాల్లో సరైన డ్రైనేజీ లేక మురికినీరు ఖాళీ స్థలాల్లోకి చేరి దోమలు ప్రబలుతున్నాయి. పట్టణంలో నిత్యం దుకాణదారులు డస్ట్‌బిన్‌లో చెత్త నింపుతుండగా, మున్సిపల్ సిబ్బంది వచ్చి తీసుకెళ్తుంటారు. కాగా ఇటీవల వాహనాలు రావడం లేదని దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులకోసారి రావడంతో చెత్త అధికంగా పేరుకుపోతుందని, దీంతో దోమలు తయారవుతున్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిత్యం వాహనాలు వచ్చేలా చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పట్టణంలోని సీతారామ ఆలయం వద్ద పేరుకుపోయిన చెత్త

### శానిటేషన్ చేపడతాం

నీరు నిల్వ ఉన్న చోట పిచికారీ చేస్తున్నాం. ఎండకాలం కావడంతో కొన్ని చోట్ల డ్రైగానే ఉన్నాయి. ఇటీవల అప్పుడప్పుడు వర్షాలు కురియడంతో ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. ప్రతి దుకాణానికి పారిశుధ్య సిబ్బంది రోజూ వెళ్లేలా చర్యలు తీసుకుంటాం.

– బాలె ఎల్లం, శానిటరి ఇన్‌స్పెక్టర్


కోరుట్లలోని ఆనంద్‌నగర్‌లో ఓ మురికి కాల్వ

## నత్తనడకన పారిశుధ్య పనులు

కోరుట్ల: పట్టణంలో ప్రత్యేక పారిశుధ్య పనులు నత్తనడకన సాగుతున్నాయి. కోరుట్లలో 33 వార్డులు ఉండగా ఈ నెల 19 నుంచి ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రత్యేక డ్రైవ్‌లో ప్రధానంగా వర్షాకాలంలో ఇబ్బందులు పడే శివారుకాలనీలపై పూర్తి స్థాయిలో దృష్టి పెడితే మంచి ఫలితాలు వస్తాయన్న ఆశలు కాలనీవాసుల్లో ఉండగా ఆ దిశలో మున్సిపల్ అధికారులు పెద్దగా శ్రద్ధ చూపకపోవడం గమనార్హం. అధికార యంత్రాంగా ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలను నిక్కచ్చిగా నిర్వహిస్తే వర్షాకాలంలో దోమల బెడద, దుర్వాసన లేకుండా ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### పనులు కొనసాగుతున్నాయి

ప్రత్యేక పారిశుధ్య పనులు పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి వర్షాకాలంలో ఏలాంటి ఇబ్బందులు రాకుండా అక్కడ అదనంగా పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేసి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చేస్తున్నాం. సమస్యలు ఉంటే ప్రజలు మా దృష్టికి తీసుకురావాలి.

– గజానంద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, కోరుట్ల

## ప్రధాన వీధులకే పరిమితం

| మున్సిపాలిటీ | ధర్మపురి |
|---|---|
| వార్డులు | 15 |
| జనాభా | 20 వేలు |
| పారిశుధ్య సిబ్బంది | 42 |

ధర్మపురి: బల్దియాలో ప్రస్తుతం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు ప్రధాన వీధుల్లో తప్ప కాలనీల్లో మచ్చుకైనా కనిపించడంలేదు. సిబ్బంది కొరత ఇందుకు కారణమని అధికారులు చెబుతున్నారు. 15 వార్డులు ఉండగా, సుమారు 20 వేల జనాభా ఉంది. పారిశుధ్య సిబ్బంది 42 మంది వరకు ఉన్నారు. వీరితో అన్నికాలనీల్లో చెత్త త్తాచెదారం, డ్రెయినేజీల్లో పూడిక తొలగించడం సాధ్యం కావడంలేదు. ఫలితంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం ప్రధాన వీధులకే పరిమితమవుతోంది.


బోయవాడ డ్రైనేజీలో చెత్తాచెదారం

### దుర్గంధం వస్తోంది



రోడ్లపై చెత్త చెదారం తొలగిస్తున్నారు. డ్రెయినేజీల్లో పూడిక తీయడంలేదు. దుర్గంధం వెదజల్లుతోంది. ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నరు. వారం రోజులకోసారైనా డ్రెయినేజీలు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలి.

– లవన్‌కుమార్, ధర్మపురి

### రోజూ పారిశుధ్య పనులు



పట్టణంలో రోజూ పారిశుధ్య పనులు చేపడుతున్నాం. రోడ్లు, డ్రెయినేజీలు శుభ్రం చేయిస్తున్నాం. ఇళ్ల నిర్మాణాల సందర్భంగా వెలువడే వ్యర్థాలు ఎప్పటికప్పుడు తరలిస్తున్నాం.

– రమేశ్, మున్సిపల్ కమిషనర్, ధర్మపురి

## క్లుప్తంగా

### జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు

జగిత్యాల: జిల్లాలోని ప్రైవేట్ రిప్యూటెడ్ జూనియర్ కళాశాలల్లో 2023–24 సంవత్సరానికి ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. మార్చి 2023లో పదో తరగతిలో 7.0 జీపీఏ ఆపై గ్రేడ్ సాధించిన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో చదివిన వారే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 22 నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు ఈ పాస్ వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందని, దీని ద్వారా దరఖాస్తు చేయాలన్నారు. ఈపాస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకునేటప్పుడు విద్యార్థులు ప్రాధాన్యత క్రమంలో మూడు పాఠశాలలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

### ఉద్యోగుల శ్రేయస్సు లక్ష్యం


సత్కరిస్తున్న జిల్లా కార్యవర్గం

జగిత్యాల: ఉద్యోగుల శ్రేయస్సు కోసమే టీఎన్జీవో పనిచేస్తుందని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు భోగ శశిధర్ అన్నారు. ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మామిల్ల రాజేందర్, మారం జగదీశ్వర్‌ను శనివారం జిల్లా కేంద్రంలో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ, పీఆర్సీ, డీఏ, సాధారణ బదిలీలు తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, అమరేందర్‌రెడ్డి, రవిచంద్ర, రవీందర్, రవి, మధుకర్ పాల్గొన్నారు.

### నియామకం


అల్లె రాము

కోరుట్ల: జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం తెలంగాణ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్‌గా కోరుట్ల పట్టణానికి చెందిన అల్లె రాము నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, రాష్ట్ర అధ్యక్షుడు మాడా రాజు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, చేనేత కార్మికుల సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

# బంద్ విజయవంతం చేయాలి

జగిత్యాల: ఆరుగాలం రైతన్న కష్టించి పండించిన పంటలను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే మిల్లర్లు తాలు, తప్ప పేరిట దోపిడీ చేస్తున్నారని జిల్లా రైతులు పేర్కొన్నారు. దీనికి నిరసనగా ఈనెల 22న బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. రైతాంగం, ప్రజలు మద్దతిచ్చి బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. నాణ్యమైన ధాన్యం అందిస్తున్నా తాలు తప్ప పేరుతో క్వింటాలుకు 5–10 కిలోలు అధిక తూకం వేస్తున్న పరిస్థితి కొనుగోలు కేంద్రాల్లో కన్పిస్తుందన్నారు. అన్ని వర్గాలవారు స్వచ్ఛందంగా మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మ్యాకల మహేశ్, మోహన్‌రెడ్డి, కరుణాకర్, క్యాతం సాయిరెడ్డి, స్వామిరెడ్డి, బుచ్చిరెడ్డి, మల్లయ్య, రాంరెడ్డి, రాకేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతులు

# వర్క్‌ఫ్రం హోం పేరుతో రూ.20 లక్షల మోసం

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన మహేందర్‌ను సైబర్ నేరగాళ్లు వర్క్‌ఫ్రం హోం పేరుతో అధికంగా సంపాధించవచ్చని సుమారు రూ.20 లక్షల వరకు మోసానికి పాల్పడ్డారు. పోలీసుల వివరాలు.. మార్చి 23న ఒక ఫోన్ నంబరు ద్వారా వర్క్ ఫ్రం హోం పని ఉందని మహేందర్కు మెస్సేజ్ పంపించగా, ఇన్‌స్టాగామ్‌లో జాయిన్ అయి ప్రొఫైల్‌లో వచ్చిన మెస్సేజ్‌ల ద్వారా రూ.110 వెచ్చించాడు. దీంతో మొదటి టాస్క్ పూర్తయిందని, మరో టాస్క్ చేయాలని రూ.2,080 డిపాజిట్ చేయించుకున్నారు. మళ్లీ మార్చి 28న రూ.9 వేలు కట్టి 4వ టాస్క్ పూర్తి చేస్తే మిగతా డబ్బులు వస్తాయని నమ్మించడంతో చెల్లించాడు. దీంతో బాధితుడిని దశల వారీగా రూ.20 లక్షల వరకు మోసం చేశారు. ఈ నేపథ్యంలో బాధితున్ని నమ్మించేందుకు సైబర్ నేరగాళ్లు మొదటి దఫా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.70 వేలు, రూ.20 వేలు చివరిన రూ.3 లక్షల వరకు అతడి ఖాతాలో వేసి.. రూ.20 లక్షలు మోసం చేయడంతో పాటు బాధితుని ఖాతాను ఫ్రీజింగ్‌లో పెట్టారు. దీంతో మోసపోయానని తెలుసుకున్న బాధితుడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ రాంచందర్‌రావు తెలిపారు.

**ఆన్‌లైన్ సామగ్రి పేరిట..**

జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్ ప్రాంతానికి చెందిన బి.నగేశ్‌ను సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. ఆన్‌టియాగో ఆన్‌లైన్ ద్వారా రూ.50 వేల విలువ గల వస్తువులు కొనుగోలు చేస్తే మరో రూ.50 వేలు అదనంగా సామగ్రి అందజేస్తామని మోసానికి పాల్పడ్డారు. పోలీసుల వివరాలు.. మొదట నగేశ్ నుంచి రూ.50 వేలు చెల్లించుకున్న మోసగాళ్లు రూ.లక్ష బ్యాలెన్స్ వచ్చినట్లు నమ్మించారు. చివరికి రూ.లక్ష విలువైన వస్తువులు కొనుగోలు చేసే సమయంలో చివరి క్షణంలో మీ మిగతా నిల్వ చేసే సమయం అయిపోయిందని, టియాగో కంపెనీ వారు కొనుగోళ్లను నిలిపివేశారు. దీంతో బాధితుడు కంపెనీ వారికి ఫోన్ చేసి అడుగగా సామగ్రి కొనుగోలుకు సమయం అయిపోయిందని, మిగతా డబ్బులు ఇవ్వడానికి వారు నిరాకరించారు. బాధితుడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

**పెట్టుబడి రెండింతలు అవుతాయని..**

జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు ప్రాంతానికి చెందిన పెంట భారతిని సైబర్ నేరస్తులు రూ.100 పెట్టుబడి పెడితే రెండింతలు అవుతాయని నమ్మించి మోసానికి పాల్పడ్డారు. హౌసింగ్‌బోర్డు ప్రాంతానికి చెందిన భారతికి ఏప్రిల్ 27న ఒక వెబ్‌సైట్ యాప్ ద్వారా తన సెల్‌ఫోన్‌కు మెస్సేజ్ రాగా అందులో రిజిష్టర్ అయింది. అనంతరం రూ.100 పెట్టుబడి పెడితే అదనంగా డబ్బులు వస్తాయని సైబర్ నేరస్తులు నమ్మించి సుమారు రూ.60 వేల వరకు వివిధ దశల్లో పెట్టుబడులు పెట్టించి విత్‌డ్రా చేశారు. తిరిగి బాధితురాలి ఖాతాలో డబ్బులు జమకాకపోవడంతో మోసానికి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు సీఐ రాంచందర్‌రావు తెలిపారు.

# రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు

- కలెక్టర్ యాస్మిన్ బాషా



జగిత్యాల: రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నామని, వారికి సమస్యలుంటే కాల్‌సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 409 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, గత సీజన్‌లో 364 మాత్రమే ఉండేవని, రైతులకు ఇబ్బందులు కలగకుండా అదనంగా సెంటర్లు ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేస్తున్నామని వివరించారు. జగిత్యాలలో మొత్తం 67 బాయిల్డ్ రైస్‌మిల్లులు ఉండగా 60 పనిచేస్తున్నాయని, 60 మిల్లులకు ధాన్యం కేటాయింపు జరుగుతుందన్నారు. ఈనెల 19 నాటికి 1,83,204 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించి మిల్లులకు తరలించి మిల్లింగ్ చేసేందుకు ఆదేశించడం జరిగిందన్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తున్నామని, గతంలో కన్నా రెండింతల ధాన్యం దిగుమతి చేశామని వెల్లడించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఏవైనా సమస్యలుంటే 1800 425 8187 నంబరుకు కాల్‌చేసి పరిష్కరించుకోవచ్చన్నారు. కేంద్రాల వద్ద డిజిటల్ కాంటాలు, తాగు నీరు, టార్పాలిన్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఐదు మండలాలకు ఒక అధికారిని ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం రోహిని కార్తె తర్వాత మృగశిర కార్తె ప్రవేశంతో వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున కొనుగోళ్లు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

# అభ్యర్థులు ప్రణాళిక బద్ధంగా చదవాలి

జగిత్యాల: పోటీ పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులు ప్రణాళిక బద్ధంగా చదవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్ సూచించారు. గ్రంథాలయంలో పట్టణ ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం నిరుద్యోగులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఎస్సై సందీప్ మాట్లాడుతూ, ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు లక్ష్యం దిశగా కృషి చేయాలన్నారు. అప్పుడే ఉద్యోగాలు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ శకుంతల పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చంద్రశేఖర్‌గౌడ్

# 21న ఫౌండేషన్ కోర్సు ప్రవేశ పరీక్ష

జగిత్యాల: 2023–24 సంవత్సరానికి సంబంధించి మొదటి బ్యాచ్ ఐదు నెలల ఫౌండేషన్ కోర్సు ఉచిత శిక్షణకు ఈనెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. 21న రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఆఫ్‌లైన్ ద్వారా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తారని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు www. tsstudycircle. co. in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. గంట ముందు పరీక్షకు హాజరు కావాలని పేర్కొన్నారు. గుర్తింపు పత్రాలు, హాల్‌టికెట్, బ్లాక్ బాల్‌పెన్‌తో పాటు హాల్‌టికెట్‌పై ఫొటో సరిగా కన్పించకుంటే గెజిటెడ్ అటెస్టేషన్ తీసుకోవాలన్నారు.

# కొనుగోళ్లను వేగవంతం చేయండి


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లత

ధర్మపురి: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ లత ఆదేశించారు. జైనా, దొంతాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆమె సందర్శించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యంలో 17శాతం తేమ ఉండేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. నాణ్యత, ప్రమాణాలు పాటించి గిట్టుబాటు ధర పొందాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేష్, జైనా పీఏసీఎస్ చైర్మన్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

**తూకం వేయండి.. మిల్లులకు తరలించండి**

సారంగాపూర్(జగిత్యాల): తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ లత సూచించారు. బీర్‌పూర్ మండలం బీర్‌పూర్, తుంగూర్, తాళ్లధర్మారం, మంగేళ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. బీర్‌పూర్‌లో కొనుగోలు కేంద్రం నిర్వాహకుల తీరుపై రైతులు ఫిర్యాదు చేశారు. అదనపు కలెక్టర్ వెంటనే స్పందించి అదనంగా బుక్‌కీపర్‌ను నియమించాలని సూచించారు. తహసీల్దార్ శ్రీలత, ఆర్‌ఐ శ్రీనివాస్, సీఈవో అయ్యోరి తిరుపతి, ఏపీఎం రజిత తదితరులు ఉన్నారు.

# ఫిట్స్‌తో ఇంటర్ విద్యార్థిని మృతి

- రామన్నపేటలో విషాదం


ఆరుక్ష పూలే(ఫైల్)

చందుర్తి(వేములవాడ): తండ్రి అనారోగ్యంతో మంచం పట్టగా.. తల్లికి తోడుగా పొలం పనుల్లో సాయంగా నిలుస్తున్న ఇంటర్ విద్యార్థినిని ఫిట్స్ బలితీసుకున్నాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం రామన్నపేటకు చెందిన దుమ్ము శ్యామల–ఆనందం దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె ఆరుక్ష పూలే ఇంటర్, చిన్నకుమార్తె సాగరిక పదో తరగతి పూర్తి చేశారు. వేసవి సెలవులు రావడంతో ఇద్దరు కుమార్తెలు ఇంటి వద్దే ఉంటున్నారు. తండ్రి ఆనందం అనారోగ్యంతో నడవలేని స్థితిలో ఉండగా.. వ్యవసాయ పనుల్లో తల్లికి తోడుగా పెద్ద కూతురు ఆరుక్ష పూలే రెండు రోజులుగా వెళ్తోంది. శనివారం పనులు చేస్తుండగానే కింద పడిపోయింది. ఫిట్స్ వచ్చాయన్న అనుమానంతో ప్రథమ చికిత్స చేశారు. స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుడు వచ్చి పరీక్షించేలోపే విద్యార్థిని మృతిచెందింది. వ్యవసాయ పనులకు వెళ్లడంతో వడదెబ్బకు గురై మృతిచెంది ఉంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలని ఆ గ్రామ సర్పంచ్ అంజయ్య కోరుతున్నారు.